# ఈసెట్‌లో 93.87% పాస్

- ఈసెట్ ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల
- 95.81శాతంతో సత్తాచాటిన అమ్మాయిలు
- జూన్ 15 తర్వాత సీట్ల భర్తీకి కౌన్సెలింగ్

హైదరాబాద్, మే 25 (నమస్తే తెలంగాణ) : పాలిటెక్నిక్, బీఎస్సీ గణితం వంటి కోర్సులు పూర్తి చేసిన వారికి, బీటెక్ రెండో సంవత్సరంలో ప్రవేశాలు కల్పించేందుకు నిర్వహించిన టీజీ ఈసెట్-2025 ఫలితాలు ఆదివారం విడుదలయ్యాయి. ఉస్మానియా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీలో నిర్వహించిన కార్యక్రమంలో ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వుడిత్యాల బాలకిష్టారెడ్డి ఫలితాలు విడుదల చేశారు. ఈ ఏడాది మొత్తంగా 93.87% విద్యార్థులు క్వాలిఫై అయ్యారు. ఈ నెల 12న ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించగా.. 18వేలకు పైగా విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 17వేలకు పైగా విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. మొత్తం 11 విభాగాలకు పరీక్షలు నిర్వహించారు.

**ప్రధాన బ్రాంచీల్లో టాపర్లు వీరే..**

| బ్రాంచి | పేరు | మార్కులు | జిల్లా |
|---|---|---|---|
| సీఎస్ఈ | కే శ్రీకాంత్ | 163 | నారాయణపేట |
| ఈసీఈ | కే రేవతి | 164 | సిద్దిపేట |
| ఈఈఈ | కే శ్రావణి | 128 | హనుమకొండ |
| మెకానికల్ | పీ కార్తీక్ | 163 | పెద్దపల్లి |
| సివిల్ ఇంజినీరింగ్ | జీ నిఖిల్ కౌశిక్ | 156 | జయశంకర్ భూపాలపల్లి |
| కెమికల్ ఇంజినీరింగ్ | ఎల్ తేజసాయి | 124 | విశాఖపట్నం, ఏపీ |
| బీఎస్సీ గణితం | బీ సంతోష్‌కుమార్ | 94 | మేడ్చల్ మల్కాజిగిరి |
| ఫార్మసీ | ఏ చందన | 123 | హనుమకొండ |
| మైనింగ్ | కే అక్షయ | 124 | పెద్దపల్లి |

**సత్తాచాటిన అమ్మాయిలు..**

ఈ ఫలితాల్లో ఎప్పటిలాగే అమ్మాయిలు సత్తాచాటారు. అమ్మాయిలు 95.81%, అబ్బాయిలు 92.71% క్వాలిఫై అయ్యారు. పాలిటెక్నిక్, బీఎస్సీ (గణితం) కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులకు ఈసెట్ ర్యాంకు ఆధారంగా బీటెక్ సెకండియర్‌లో (ల్యాటరల్ ఎంట్రీ) ప్రవేశాలు కల్పిస్తారు. ఈ కౌన్సెలింగ్ జూన్ 15 తర్వాత ప్రారంభంకానున్నది. ఇంజినీరింగ్ కాలేజీల్లో పలు బ్రాంచీల్లో మొత్తం 25 వేల సీట్లున్నాయి. ఇవేకాకుండా ఎప్‌సెట్ వెబ్ కౌన్సెలింగ్ తర్వాత బీటెక్ ఫస్టియర్‌లో సీట్లు మిగిలితే, అవి సెకండియర్‌లో ఖాళీగా ఉంటాయి. మిగిలిన సీట్లను సైతం ఈసెట్ ద్వారానే భర్తీచేస్తారు. క్వాలిఫై అయిన అందరికీ సీట్లు దక్కనున్నాయి.

## 5న డీఈఈసెట్ ఫలితాలు

### పరీక్షకు 77.54% మంది విద్యార్థుల హాజరు

హైదరాబాద్, మే 25 (నమస్తే తెలంగాణ) : డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఈఎల్‌ఈడీ), డిప్లొమా ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్(డీపీఎస్‌ఈ) కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన డీఈఈసెట్ ఫలితాలు జూన్ 5న విడుదలకానున్నాయి. పరిస్థితులు అనుకూలిస్తే జూన్ 5 లోపు ఎప్పుడైనా ఫలితాలు విడుదల చేయనున్నారు. డీఈఈ సెట్ పరీక్షను ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించారు. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో ఆన్‌లైన్‌లో నిర్వహించిన పరీక్షకు 77.54% మంది విద్యార్థులు హాజరైనట్టు అధికారులు ప్రకటించారు. 43,615 మంది దరఖాస్తు చేయగా 33,821 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు.

మరిన్ని వార్తలు ntnews.com లో చూడగలరు

## తిరుమలకు పోటెత్తిన భక్తులు

హైదరాబాద్, మే 25 (నమస్తే తెలంగాణ): తిరుమలలో భక్తుల తాకిడి పెరిగింది. శనివారం ఒక్క రోజే 90,211 మంది భక్తులు దర్శించుకున్నారు. మూడు రోజుల్లో 2.4 లక్షల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నట్టు అధికారులు వెల్లడించారు.

**శ్రీవారి సేవలో ఎన్నారైలు**

తిరుమల శ్రీవారికి సేవ చేసేందుకు పలు దేశాలకు చెందిన ఎన్నారైలు స్వచ్ఛందంగా వస్తున్నారని టీటీడీ ఈవో జే శ్యామలరావు తెలిపారు. అదనపు ఈవో వెంకయ్య చౌదరితో ఏర్పాటు చేసిన సమావేశంలో 14దేశాలకు చెందిన ఎన్నారైలు వర్చువల్‌గా హాజరయ్యారు.

## సివిల్స్ ప్రిలిమ్స్ కటాఫ్ 79!

- మధ్యస్తం నుంచి కాస్త కఠినంగా ప్రశ్నలు
- 20 వేల మంది గైర్హాజరు
- జూన్ 10న ఫలితాల విడుదల

హైదరాబాద్, మే 25 (నమస్తే తెలంగాణ) : యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమ్స్ జనరల్ స్టడీస్ (పేపర్-1) కటాఫ్‌పై రకరకాల ఊహాగానాలు వెలువడుతున్నాయి. అయితే ఓవరాల్ కటాఫ్ తగ్గొచ్చని బ్రెయిన్ ట్రీ అకాడమీ డైరెక్టర్ గోపాలకృష్ణ విశ్లేషించారు. జనరల్ క్యాటగిరీలో 79, ఈడబ్ల్యూఎస్ 75, ఓబీసీ 77.50, ఎస్సీ 71.50, ఎస్టీ 68 మార్కులు కటాఫ్‌గా ఉండొచ్చని విశ్లేషించారు. నిరుడు జనరల్ క్యాటగిరీ కటాఫ్ 89 మార్కులుండగా, ఈ సారి తగ్గే అవకాశమున్నట్టు అంచనా వేశారు. యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమ్స్ పరీక్షను ఆదివారం నిర్వహించారు. జాతీయంగా నిర్వహించిన ఈ పరీక్షలో ఇచ్చిన ప్రశ్నలు మధ్యస్తం నుంచి కాస్త కఠినంగా ఉన్నట్టు అభ్యర్థులు తెలిపారు. ముఖ్యంగా చరిత్ర నుంచి అత్యధికంగా ప్రశ్నలిచ్చినట్టు అనలాగ్ అకాడమీ మేనేజింగ్ డైరెక్టర్ విన్నకోట శ్రీకాంత్ విశ్లేషించారు. చరిత్ర ప్రశ్నలు సులభంగానే ఉండటంతో విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నట్టు తెలిపారు. కరెంట్ అఫైర్స్ ప్రశ్నలు కఠినంగా ఉన్నట్టు విశ్లేషించారు. ప్రశ్నలు పెద్దవిగా, కాస్త కఠినంగా ఇచ్చినట్టు అభ్యర్థులు తెలిపారు. ఇచ్చిన ఆప్షన్ల నుంచి ఎలిమినేషన్ చేయలేని సందిగ్ధ స్థితిని ఎదుర్కొన్నట్టు అభ్యర్థి శశాంక్ తెలిపారు. ఎకానమీ, సోషల్ డెవలప్‌మెంట్ నుంచి 15, చరిత్ర, సంస్కృతి నుంచి 16, జనరల్ సైన్స్ నుంచి 9, ఇండియన్ పాలిటీ, గవర్నెన్స్ నుంచి 16, ఎన్విరాన్‌మెంట్ ఎకాలజీ నుంచి 13, జాగ్రఫీ 14, జనరల్ నాలెడ్జ్ 5, కరెంట్ అఫైర్స్ విభాగం నుంచి 12 ప్రశ్నలు ఇచ్చినట్టు నిపుణులు తెలిపారు.

**ఒక్క గ్రేటర్‌లోనే భారీగా గైర్హాజరు**

రాష్ట్రంలో హైదరాబాద్, వరంగల్ పట్టణాల్లో పరీక్షలు నిర్వహించారు. సివిల్స్ పరీక్షలకు ఈ సారి భారీగా 20వేల మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. ఒక్క గ్రేటర్‌లోనే 17,889 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. హైదరాబాద్‌లో పరీక్షలు రాసేందుకు 43,676 మంది దరఖాస్తు చేసుకోగా, వీరిలో 26,676 మంది పేపర్‌కు-1కు, 25,787 మంది పేపర్-2కు హాజరయ్యారు. పేపర్-1 రాసిన వారిలో 245 మంది పేపర్-2 పరీక్షకు గైర్హాజరయ్యారు. జూన్ 10న ఫలితాలు విడుదలకానున్నాయి.

## గురుకుల విద్యార్థులకు ఉపాధి శిక్షణ

- ఉన్నతి ఫౌండేషన్‌తో ఎస్సీ గురుకుల సొసైటీ ఒప్పందం
- జూన్ నుంచి రాష్ట్రవ్యాప్తంగా 238 కేంద్రాల్లో నిర్వహణ

హైదరాబాద్, మే 25 (నమస్తే తెలంగాణ): తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సొసైటీ పరిధిలోని గురుకుల విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి రంగాలకు సంబంధించి నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నారు. ఎస్‌జీబీఎస్ ఉన్నతి ఫౌండేషన్‌తో ఎస్సీ గురుకుల సొసైటీ ఒప్పందం కుదుర్చుకున్నది. సొసైటీ కార్యదర్శి అలుగు వర్షిణి ఆదివారం ప్రకటనలో వెల్లడించారు. పది, ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు, ప్రస్తుతం ఫైనల్ ఇయర్ చదువుతున్న గురుకుల విద్యార్థులకు ప్రత్యేక నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని రూపొందించామని తెలిపారు. ఉన్నతి ఫౌండేషన్ సహకారంతో 'యూ ఎన్ ఎక్స్ టీ' సంస్థ ఆధ్వర్యంలో 90 గంటలు తరగతి గదిలో ప్రత్యక్షంగా, 75 గంటలు సెల్ఫ్ లెర్నింగ్ విధానంలో శిక్షణ ఉంటుందని వివరించారు. స్పోకెన్ ఇంగ్లిష్, లైఫ్ స్కిల్స్, జీవన నైపుణ్యాలు, హెచ్‌ఆర్ సంబంధిత విషయాల్లో స్కిల్స్, ఇంటర్వ్యూ అంశాలపై శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. జూన్ మూడో వారం నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. రాష్ట్టవ్యాప్తంగా 238 గురుకుల కేంద్రాల్లో ఈ శిక్షణ కార్యక్రమం కొనసాగుతుందని వెల్లడించారు. ప్రతీఏటా 36 వేల మంది విద్యార్థులకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

## ఓయూలో సెమికండక్టర్ కోర్సు

- ఎన్‌బీఏ బాటలో ఓయూ ఇంజినీరింగ్ కాలేజీ
- వచ్చే ఏడాది బీటెక్ వీఎల్ఐఎస్ కోర్సు, ఈసీఈలో మరో 60 సీట్లు

హైదరాబాద్, మే 25 (నమస్తే తెలంగాణ) : ఉస్మానియా ఇంజినీరింగ్ కాలేజీ ఎన్‌బీఏ గుర్తింపుకోసం దరఖాస్తు చేసింది. నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్(ఎన్‌బీఏ) గుర్తింపునకు కాలేజీ ఇటీవలే దరఖాస్తు సమర్పించింది. ఎన్‌బీఏ గుర్తింపు దక్కిన తర్వాత ఇంజినీరింగ్ కాలేజీలో సెమికండక్టర్ కోర్సును వచ్చే విద్యాసంవత్సరం నుంచి ప్రవేశపెడతారు. బీటెక్ వీఎల్ఎస్ఐ పేరుతో కొత్త కోర్సు ప్రవేశపెట్టాలని నిర్ణయించినట్టు ఓయూ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ తెలిపారు. ఈసీఈ కోర్సులో మరో సెక్షన్‌ను ప్రారంభించనున్నామని తెలిపారు. 60 సీట్లతో మరో సెక్షన్ వచ్చే విద్యాసంవత్సరం అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. ఎలక్ట్రానిక్స్ కోర్సులో 50 నుంచి 60 సీట్లకు, బయోమెడికల్ ఇంజినీరింగ్‌లో సీట్లను 30 నుంచి 60కి పెంచనున్నట్టు వెల్లడించారు.

## జేఈఈ అడ్వాన్స్‌డ్ ప్రైమరీ 'కీ' విడుదల

హైదరాబాద్, మే 25 (నమస్తే తెలంగాణ) : జేఈఈ అడ్వాన్స్‌డ్ ప్రాథమిక 'కీ' విడుదలయ్యింది. పేపర్-1, పేపర్-2 రెండింటి ప్రాథమిక 'కీ'ని ఐఐటీ కాన్పూర్ ఆదివారం వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. ఈ నెల 18న జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష నిర్వహించారు. ఈ నెల 27 సాయంత్రం 5 గంటల వరకు ప్రాథమిక 'కీ'పై అభ్యంతరాలు వ్యక్తంచేయవచ్చు. జూన్ 2న ఫలితాలు విడుదలవుతాయి.

## బడుల్లో ఫోన్ల వినియోగంపై రోజుకో ఆదేశం

హైదరాబాద్, మే 25 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని ప్రభుత్వ బడుల్లో సెల్‌ఫోన్ల వినియోగంపై గందరగోళం నెలకొన్నది. రోజుకో ఆదేశాలు.. పూటకో ఉత్తర్వులను తలపిస్తున్నది. ఇటీవలే టీచర్లు బడుల్లో సెల్‌ఫోన్ వాడొద్దని విద్యాశాఖ ఆదేశించింది. పాఠశాల వేళల్లో తరగతి గదుల్లో సెల్‌ఫోన్లు వినియోగించవద్దన్నది. విద్యార్థులు కూడా సెల్‌ఫోన్లు వాడకుండా చూడాలని ఆదేశాలిచ్చింది. వాడితే చర్యలు తప్పవని హెచ్చరించింది. తాజాగా సెల్‌ఫోన్లు వాడొచ్చని మళ్లీ ఆదేశాలిచ్చింది. అదే పనిగా సెల్‌ఫోన్ వాడొద్దని కేవలం ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణలో ఫేషియల్ అటెండెన్స్, ఇంటర్నెట్, పాఠాల బోధనకు మాత్రమే సెల్‌ఫోన్ వాడొచ్చని స్పష్టంచేసింది. అధికారిక పనుల కోసమే సెల్‌ఫోన్లు వినియోగించాలని నొక్కి చెప్పింది. విద్యాశాఖ ఆదేశాలతో పలు జిల్లాల డీఈవోలు సెల్‌ఫోన్ వినియోగంపై స్థానికంగా ఉత్తర్వులిచ్చారు. ముందు హడావుడిగా ఉత్తర్వులివ్వడం.. ఆ తర్వాత నాలుక కరుచుకుని మళ్లీ మార్చడంపై టీచర్లు విస్మయం వ్యక్తంచేస్తున్నారు.

## ఒకే రోజు 26 మాల్ ప్రాక్టీస్ కేసులు

హైదరాబాద్, మే 25 (నమస్తే తెలంగాణ) : ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో ఆదివారం ఒకే రోజు 26 మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదయ్యాయి. ఆదివారం గణితం, జువాలజీ, హిస్టరీ పేపర్లకు పరీక్షలు నిర్వహించగా ఫస్టియర్‌లో 17 మంది, సెకండియర్‌లో మరో తొమ్మిది మంది కాపీయింగ్‌కు పాల్పడుతూ పట్టుబడ్డారు. ఒక్క సంగారెడ్డి జిల్లాలోనే 22 మంది డిబార్ అయ్యారు. ఫస్టియర్‌లో 14 మంది, సెకండియర్‌లో 8 మంది చొప్పున కాపీయింగ్‌కు పాల్పడగా, వారిని డిబార్‌చేశారు. వరంగల్, సిద్దిపేటలో ఒకరు చొప్పున, మెదక్ జిల్లాల్లో ఇద్దరు చొప్పున మొత్తం నలుగురు విద్యార్థులు పట్టుబడ్డారు. ఫస్టియర్ పరీక్షలకు 8,176 మంది, సెకండియర్‌కు 3,049 మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు అధికారులు తెలిపారు.

















